సాక్షి
కామారెడ్డి
గురువారం । 22 । మే । 2025



అర్హులందరికీ ఇళ్లు..
అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.
- 9లో ▸



విద్యార్థుల సంఖ్య పెంచాలి
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఈవో రాజు పేర్కొన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.3 /21.0

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

బాన్సువాడలో తిరంగా ర్యాలీ



బాన్సువాడ: మన సైనికుల వీరత్వం, త్యాగాలు ఎనలేనివని మాజీ ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. సైన్యం పరాక్రమానికి ప్రతీక ఆపరేషన్ సిందూర్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని బుధవారం బాన్సువాడలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి పాత అంగడి బజార్, తాడ్కోల్ చౌరస్తా, రాజీవ్ చౌరస్తా మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. జాతీయ జెండాలతో పాటు ఆపరేషన్ సిందూర్ ప్లకార్డులు, మోదీ కటౌట్‌లతో ర్యాలీతీశారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులతోపాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



ఎల్లారెడ్డిరూరల్: జిల్లాలో గురువారం నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని చీఫ్ సూపరింటెండెంట్లు నిజాం, లక్ష్మణ్‌సింగ్ తెలిపారు. 29 వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు ఉంటాయని తెలిపారు.

ఆస్పత్రి పరిశీలన



బిచ్కుంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిచ్కుంద ఆస్పత్రిని వంద పడకలుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ. 26 కోట్లు కేటాయించిందన్నారు. ఆస్పత్రి భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించేందుకు వైద్య విధాన పరిషత్ టెక్నికల్ ఈఈ కుమార్, ఏఈ సాగర్ వచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జునప్ప శెట్కార్, నాగ్‌నాథ్, విఠల్ రెడ్డి, డాక్టర్ కాళీదాస్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన



బాన్సువాడ : పాత బాన్సువాడలోని గూడెం గల్లీవాసులు బుధవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదిహేను రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో అన్ని కాలనీలలో మిషన్ భగరథ నీళ్ల కోసం పైపులు వేశారని, గూడెంగల్లీలో మాత్రం వేయలేదని పేర్కొన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించకపోతే మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

పాము కాటుతో బాలుడి మృతి



నస్రుల్లాబాద్: పాము కాటుతో నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. సంగం గ్రామంలో సుజాత, అశోక్ దంపతుల కుమారుడు రిషి కుమార్ బుధవారం ఇంట్లో ఆడుకుంటున్నాడు. బాలుడి కాలు నుంచి రక్తం కారుతుండడాన్ని గమనించిన తల్లి గాయం అయి ఉంటుందని భావించి పసుపు రాసింది. కొద్దిసేపటి తర్వాత బాబు కళ్లు తేలేయడంతో భయానికి గురయ్యింది. అంతలోనే పాము కనబడడంతో పాము కరిచి ఉండవచ్చన్న అనుమానంతో బాలుడిని బాన్సువాడ ఆస్పత్రికి తీసుకెళ్లగా సిబ్బంది నిజామాబాద్‌కు వెళ్లమన్నారు. అప్పటికే శరీరం అంతా విషం వ్యాపించడంతో బాలుడు మృతి చెందాడు. ముగ్గురు కూతుళ్ల తర్వాత ఎంతో కాలానికి కొడుకు పుట్టాడని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలో కురిసిన భారీ వర్షానికి పాము ఇంట్లోకి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు.



గిరి పుత్రులకు సౌర జల వికాసం!

- ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చిన పోడు భూముల అభివృద్ధికి చర్యలు
- ఐదేళ్ల ప్రణాళిక ఖరారు చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 6,492 మంది రైతులు, 13,346 ఎకరాల భూమి..
- ఈ ఏడాది 308 మందికి అవకాశం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఆర్‌వోఎఫ్‌ఆర్‌-2006 యాక్ట్ ద్వారా పోడు పట్టాలు ఇచ్చిన భూములను అభివృద్ధి చేయడం కోసం ప్రభుత్వం ఇందిర సౌర గిరి జల వికాసం పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా పోడుపట్టాలు పొందిన రైతులకు ప్రభుత్వం చేయూతనివ్వనుంది. భూమి అభివృద్ధి, బోరు/బావి తవ్వకం, సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు పంటల సాగుకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పించనున్నారు. ఈ పథకంలో ఏడాదికి కొంత మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేయనున్నారు. ఐదేళ్ల కాలంలో పోడు పట్టాలు పొందిన గిరిజన రైతులందరికీ సౌకర్యాలు కల్పించడానికి ప్రణాళిక రూపొందించారు. జిల్లాలో ఐదేళ్ల కాలంలో జిల్లాలో 6,492 మంది గిరిజనులకు సంబంధించి 13,346 ఎకరాల భూమికి అన్ని సౌకర్యాలు కల్పించి రైతులకు మేలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీని కోసం ఈ ఏడాది జిల్లాలో 308 మంది రైతులను ఎంపిక చేయనున్నారు. గిరిజన రైతులు ఆర్థికంగా ఎదగడానికి ఈ పథకం దోహదపడుతుందని భావిస్తున్నారు.

జిల్లా, మండల స్థాయిల్లో కమిటీలు

కలెక్టర్ చైర్మన్‌గా, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, జిల్లా భూగర్భ జలశాఖ అధికారి, జిల్లా అటవీ అధికారి, జిల్లా రవాణా అధికారి, జిల్లా హార్టికల్చర్ అధికారి, విద్యుత్ ఎస్‌ఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, జిల్లా పంచాయతీ అధికారి, రెడ్‌కో డీఎం తదితరులు సభ్యులుగా ఏర్పాటయ్యే కమిటీ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని పర్యవేక్షించనుంది. మండల స్థాయిలో ఎంపీడీవో చైర్మన్‌గా, వివిధ శాఖల అధికారులు సభ్యులుగా ఉండి క్షేత్ర స్థాయిలో పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక నుంచి పనులు పూర్తయ్యేవరకు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఐదేళ్లలో పోడు పట్టాలు పొందిన రైతులందరి భూముల్లో జలసిరులు కురిపించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక

దశాబ్దాలుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చి ఆదుకున్నారు. పోడు పట్టాలు రావడంతో అటవీ శాఖ అధికారుల వేధింపులు చాలావరకు ఆగిపోయాయి. పోడు పట్టాలు పొందిన రైతులను ఆదుకునేందుకు ప్రస్తుత ప్రభుత్వం ఇందిర సౌర గిరి జల వికాసం పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా పోడు భూములను అభివృద్ధి చేసి పంటల సాగుకు అనుకూలంగా తయారుచేస్తారు. భూగర్భ జల శాఖ ద్వారా సర్వే నిర్వహించిన అనంతరం బావులు/బోర్లు తవ్విస్తారు. బోర్లకు, బావులకు మోటార్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ సౌకర్యం కోసం సోలార్ ప్యానెల్స్ బిగిస్తారు. అనంతరం ఆ భూముల్లో హార్టికల్చర్ పంటల సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం రైతులను సమాయత్తం చేయనుంది. పోడు పట్టాలు పొందిన రైతులు నిలదొక్కుకుని ఆర్థికాభివృద్ధి సాధించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

పోడు భూముల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక వివరాలు..

సంవత్సరం	రైతులు	ఎకరాలు
2025-26	308	850
2026-27	1,546	3,124
2027-28	1,546	3,124
2028-29	1,546	3,124
2029-30	1,546	3,124
మొత్తం	6,492	13,346

ఎరువులను అందుబాటులో ఉంచాలి

- నకిలీ విత్తనాల బెడదను అరికట్టాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, వేదికపై డీఏవో తిరుమల ప్రసాద్, ఉద్యాన అధికారి జ్యోతి

కామారెడ్డి క్రైం: ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో దాదాపు 5 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల బెడద రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి ఎక్కువగా సాగు చేసే జుక్కల్ నియోజకవర్గం పరిధిలో నకిలీ విత్తనాలు రాకుండా టాస్క్‌ఫోర్స్ బృందాలతో తనిఖీలు చేపట్టాలని సూచించారు. మార్చి నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా కురిసిన అకాల వర్షాల వల్ల 193 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. వాటి వివరాలను సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఈ యేదాది 3 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు జరిగేలా చూడాలన్నారు. ఇందుకుగాను ప్రణాళికలు సిద్ధం చేయాలని, నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉపాధి హామీ కింద చేపట్టాల్సిన ఫాంపాండ్స్, నీటి సంరక్షణ పనులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, ఏడీఏలు, ఏవోలు, హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చెక్‌పోస్టులు..

ఇసుక అక్రమ రవాణాను నియంత్రించడానికి అవసరమైన చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. హస్గుల్, కుర్లా గ్రామాల స్థానిక అవసరాల కోసం తహసీల్దార్‌లు ఇచ్చే అనుమతులు, సులభమైన పద్ధతిలో ఇసుక రవాణా, అక్రమ రవాణా నియంత్రణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, మైన్స్ ఏడీ నగేష్, భూగర్భజల శాఖ ఏడీ సతీష్ యాదవ్, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వానొచ్చే.. కల్యాణ వేదిక మారే!



పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షం నీరు

నాగిరెడ్డిపేట: భారీ వర్షం కారణంగా పోచారంలో వివాహ వేదిక మారింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యాదయ్య తన కూతురు వివాహాన్ని బుధవారం జరిపించేందుకు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాట్లు చేసుకున్నాడు. కాగా మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో పాఠశాల ఆవరణలో నీరునిండి చెరువులా మారింది. ఆ నీటిని తొలగించే పరిస్థితి లేకపోవడంతో కల్యాణ వేదికను బంజర గ్రామ సమీపంలోని ఫంక్షన్ హాల్‌కు మార్చాడు. వేదిక మారిన విషయాన్ని యాదయ్య కుటుంబ సభ్యులు సోషల్ మీడియా ద్వారా బంధుమిత్రులకు తెలియజేశారు.

యూనిఫాం సగమే!

- బాటమ్ క్లాత్ మాత్రమే సరఫరా
- టాప్ క్లాత్ రాలేదంటున్న అధికారులు



భిక్కనూరులో యూనిఫాం స్టిచ్చింగ్‌ను పరిశీలిస్తున్న డీపీఎం రమేశ్‌బాబు

నాగిరెడ్డిపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించేందుకు యూనిఫాంలను సిద్ధం చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు బాటమ్ క్లాత్ మాత్రమే రావడంతో నిక్కర్ లేదా ప్యాంట్‌లు కుడుతున్నారు. టాప్‌కు సంబంధించిన క్లాత్ రాకపోవడంతో చొక్కా, పైజామాల పనులు మొదలు కాలేదు.

జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో ఉన్న 955 ప్రభుత్వ పాఠశాలల్లో 72,081 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 34,428 మంది బాలురు, 37,653 మంది బాలికలు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం రెండు జతల చొప్పున యూనిఫాంలు అందిస్తుంది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి ఒక జత యూనిఫాం సిద్ధం చేయాలన్న లక్ష్యంతో ఉంది. యూనిఫాంలు కుట్టే బాధ్యతను ప్రభుత్వం జిల్లాలో మహిళా సంఘాల్లో ఉన్న 1,515 మంది టైలర్స్‌కు అప్పగించింది. ఒక్కో జతకు రూ.75 చొప్పున స్టిచ్చింగ్ చార్జీ చెల్లించనున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 41,971 మంది విద్యార్థులకు సంబంధించి బాటమ్(ప్యాంట్)ను కుట్టేశారు. 58 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా విద్యార్థులకు సంబంధించిన బాటమ్ స్టిచ్చింగ్ పనులు కొనసాగుతున్నాయి. కాగా యూనిఫామ్‌కు సంబంధించి ఇప్పటివరకు బాటమ్(నిక్కర్ లేదా ప్యాంట్) క్లాత్ మాత్రమే సరఫరా అయ్యింది. బాలురకు చొక్కా, బాలికలకు పైజామాకు సంబంధించి టిస్కో నుంచి క్లాత్ రావాల్సి ఉంది. త్వరగా క్లాత్ అందితే పాఠశాలలు తెరిచే నాటికి స్టిచ్చింగ్ పూర్తయ్యే అవకాశాలున్నాయి. లేకపోతే విద్యార్థులు ఇబ్బందిపడాల్సి వస్తుంది.

సిద్ధం చేస్తాం



విద్యార్థుల యూనిఫాంలు కుట్టే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికి విద్యార్థులకు యూనిఫాంలు అందేలా చూస్తాం.

– సురేందర్, డీఆర్‌డీవో

‘తొలకరి’కి ముందే..

- జిల్లా అంతటా కురుస్తున్న వర్షాలు
- సాగు పనులకు సన్నద్ధమవుతున్న రైతులు



బొగ్గుగుడిసె చౌరస్తా వద్ద కురుస్తున్న వర్షం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఇంకా రోహిణి కార్తె రానే లేదు.. ఎండాకాలం పోనేలేదు.. జిల్లాను వరుణుడు పలకరించాడు. మండు వేసవిలో నిండుగా కమ్ముకొచ్చిన కారు మేఘాలు జిల్లా అంతటా విస్తారంగా వర్షించాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చాలా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బుధవారం ఉదయం కూడా వాన దంచికొట్టింది. సాయంత్రం కూడా చాలా ప్రాంతాల్లో వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడింది. సాధారణంగా జూన్ రెండో వారం దాటిన తర్వాత తొలకరి జల్లులు పలకరిస్తాయి. అయితే అకాల వర్షాలు, తుపాన్లతో మరింత ముందుగా వానలు కురుస్తుండడంతో తొలకరి ముందుగానే వచ్చిందని రైతులు సంతోషపడుతున్నారు. వచ్చే వానాకాలం సీజన్‌పై అన్నదాతలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముందుగానే కురుస్తున్న వర్షాలతో దుక్కులు సిద్ధం చేసుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వారం పది రోజులుగా అకాల వర్షాలు కురిసి ఇప్పటికే నేల నానింది. తాజాగా కురుస్తున్న వర్షాలతో మరింతగా భూమి నానిందని రైతులు అంటున్నారు. కాగా కొన్నిచోట్ల ఇంకా వడ్లు కల్లాల్లోనే ఉన్నాయి. అవి తడిసిపోయి రైతులు ఇబ్బంది పడుతున్నారు.



బాన్సువాడ ఎస్‌బీఐ ప్రాంతంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు(మి.మీటర్లలో)..

నమోదు కేంద్రం	వర్షపాతం	నమోదు కేంద్రం	వర్షపాతం	నమోదు కేంద్రం	వర్షపాతం
తాడ్వాయి	40.0	సదాశివనగర్	26.0	బిచ్కుంద	13.8
కామారెడ్డి	34.5	పెద్దకొడప్‌గల్	21.8	బొమ్మన్‌దేవ్‌పల్లి	13.5
అర్గొండ	34.3	రామలక్ష్మణపల్లి	21.8	మేనూరు	13.0
ఎల్పుగొండ	32.8	భిక్కనూరు	20.5	పిట్లం	13.0
ఇసాయిపేట	31.3	పాత రాజంపేట	19.3	బీబీపేట	12.8
రామారెడ్డి	29.5	బీర్కూర్	17.3	డోంగ్లీ	12.0
		నస్రుల్లాబాద్	16.5		

చివరి దశకు ధాన్యం సేకరణ



కోమలంచలో వడ్లు తూకం వేస్తున్న హమాలీలు

- జిల్లాలో 3.54 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- 129 కేంద్రాల్లో కొనసాగుతున్న తూకాలు

నిజాంసాగర్: యాసంగి సీజన్‌కు సంబంధించిన వరిధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకుంటున్నాయి. 317 కేంద్రాలలో కాంటాలు పూర్తయ్యాయి. మరో 129 కేంద్రాలు కొనసాగుతున్నాయి.

జిల్లాలో ధాన్యం సేకరణ కోసం 446 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఇప్పటివరకు 66,788 మంది రైతులనుంచి రూ. 815 కోట్ల విలువైన 3.51 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం సేకరించారు. ధాన్యం విక్రయించిన రైతులకు ఆన్‌లైన్ ద్వారా బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమ చేస్తున్నారు. ఇప్పటివరకు రూ. 766 కోట్లను రైతులకు అందించినట్లు అధికారులు తెలిపారు.

బోనస్ కోసం..

జిల్లాలోని ఆయా కొనుగోలు కేంద్రాల్లో 24,570 మంది రైతులు సన్నరకాలను విక్రయించారు. వీరికి బోనస్ కోసం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 1.61 లక్షల మెట్రిక్ టన్నుల మేర సన్న రకం ధాన్యం రాగా.. వాటికి సంబంధించి రైతులకు రూ. 80 కోట్ల బోనస్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నారు.

తూకాలు పూర్తి కావడంతో పలు కేంద్రాలను మూసి వేశారు. ప్రస్తుతం 129 కేంద్రాల్లో కాంటాలు కొనసాగుతున్నాయి. మహమ్మద్‌నగర్, నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద, మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్, డోంగ్లి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, నాగిరెడ్డిపేట తదితర మండలాల్లో వరిధాన్యం కొనుగోళ్లు పూర్తికాలేదు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం రూ.18 వేలు లంచం తీసుకుంటూ దొరికిన వైనం
- రాంచంద్రాపల్లిలోని సొంతింట్లో సోదాలు
- నాంపల్లి కోర్టుకు తరలింపు



ఏసీబీకి చిక్కిన గంగామోహన్

మాక్లూర్: ఇంటి స్థలం(ప్లాట్) రిజిస్ట్రేషన్ చేయించేందుకు రూ. 18 వేలు లంచం తీసుకుంటూ గొట్టిముక్కల పంచాయతీ కార్యదర్శి గంగామోహన్ బుధవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. దీంతో ఆయన స్వగ్రామం ఆలూర్ మండలం రాంచంద్రాపల్లిలోని సొంతింట్లో కూడా ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. 5 ఏళ్లుగా గంగామోహన్ గొట్టిముక్కల పంచాయతీ కార్యదర్శిగా కొనసాగుతున్నాడు. ఇతను పంచాయతీ కార్యదర్శుల సంఘానికి మండల అధ్యక్షుడు కూడా. గొట్టిముక్కల గ్రామానికి చెందిన ముప్పడి రాజేందర్ ఇంటి స్థలం (ప్లాట్) రిజిస్ట్రేషన్ విషయమై పంచాయతీ కార్యదర్శి గంగామోహన్‌ను సంప్రదించగా అతను రూ. 25 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఇద్దరి మధ్య రూ.18 వేలకు ఒప్పందం కుదిరింది. ముందుగా డబ్బులు చెల్లిస్తేనే ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయిస్తానని గంగామోహన్ చెప్పడంతో బాధితుడు రాజేందర్ గత్యంతరం లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు బుధవారం ముందుగానే గ్రామానికి చేరుకొని బాధితుడికి సూచనలు ఇచ్చి పంపించారు. పకడ్బందీగా వ్యవహరించి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో గంగామోహన్ బాధితుడు రాజేందర్‌నుంచి లంచం డబ్బులు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గంగామోహన్‌పై గతంలో కూడా ఫిర్యాదులు వచ్చాయని ఏసీబీ డీఎస్పీ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. నిందితుడిని నాంపల్లి కోర్టుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

పోక్సో చట్టంపై అవగాహన


బాన్సువాడలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మోహన్

బాన్సువాడ: పోక్సో చట్టంపై ఉపాధ్యాయులకు బుధవారం ఎస్సై మోహన్ అవగాహన కల్పించారు. పట్టణంలోని కోన బాన్సువాడ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయో వివరించారు. నేరాలను అరికట్టేందుకు సైబర్ క్రైమ్ నంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు. మహిళల కోసం షీటీం అందుబాటులో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వర్‌రావు, షీటీం సభ్యులు అనిల్, సాయిలు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలను పసిగట్టాలి


డోంగ్లీలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై

మద్నూర్(జుక్కల్): సైబర్ నేరాలను ముందుగానే పసిగట్టి జాగ్రత్త పడాలని ఎస్సై విజయ్ కొండ సూచించారు. డోంగ్లీ మండల కేంద్రంలో బుధవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత సైబర్ నేరాలను గుర్తించాలని కుటుంబసభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే 100 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీ..
నలుగురికి తీవ్రగాయాలు

నస్రుల్లాబాద్ : మండలంలోని దుర్కి గ్రామ శివారులో గల జాతీయ రహదారి 765డీ రోడ్డుపై బుధవారం దుర్కి నుంచి బాన్సువాడ వైపు వెళుతున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఆటోలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా, అతి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. క్షతగాత్రులను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని పీఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

మద్నూర్(జుక్కల్): మండలంలోని కోడిచిర గ్రామశివారులో బుధవారం విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందినట్లు బాధిత రైతు బేతే సంజు తెలిపారు. ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడడంతో మేత కోసం వెళ్లిన ఆవుకు తగిలి అక్కడికక్కడే మరణించింది. ఆవు విలువ రూ.35 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

మద్నూర్(జుక్కల్): మండలంలోని కోడిచిరలో పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు. కోడిచిరలో పేకాడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు స్థావరంపై బుధవారం దాడి చేసి నలుగురితోపాటు రూ.1,670 నగదు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ముదిరాజ్‌లు ఐక్యత చాటాలి

- ఎమ్మెల్సీ కోటా నుంచి ముదిరాజ్‌లకు రూ. 10 లక్షలు మంజూరు
- మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్
- పర్మళ్ల పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


పర్మళ్లలో మాట్లాడుతున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

లింగంపేట(ఎల్లారెడ్డి): ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పర్మళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో పెద్దమ్మ ఆలయాలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ముదిరాజ్ కులస్తులకు సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముదిరాజ్‌లను బీసీ డి నుంచి బీసీ ఏ లోకి మార్చడానికి కార్యచరణ కొనసాగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సహకారంతో నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో సొసైటీల ఏర్పాటు, కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేసుకోవాలని సూచించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ముదిరాజ్ సంఘం భవనం కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లు సత్తా చాటాలన్నారు. ఎమ్మెల్సీ కోటా నుంచి ముదిరాజ్‌లకు రూ. 10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాయకులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్, టీజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేశ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత, వెంకట్రాంరెడ్డి, జిల్లా ముదిరాజ్ అధ్యక్షుడు బట్టు విఠల్, మండల అధ్యక్షుడు దాసరి సాయికుమార్, పర్మళ్ల మాజీ సర్పంచ్ బద్ద లక్ష్మయ్య, ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మండలి డిప్యూటీ చైర్మన్‌కు ముదిరాజ్ సంఘం నాయకుల స్వాగతం

కామారెడ్డి అర్బన్: ముదిరాజ్ జిల్లా సంఘానికి కామారెడ్డిలో కేటాయించిన రెండు ఎకరాల స్థలానికి హద్దులు నిర్ణయించి చూపించాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ఆర్డీవోను కోరారు. బుధవారం శాసనమండలి డిప్యూటీ చైర్మన్ కామారెడ్డి ఆర్ అండ్ బీ అతిథిలో ముదిరాజ్ సంఘం నాయకులు పున్న రాజేశ్వర్, గజ్జల బిక్షపతితో పాటు పలువురు నాయకులు బండ ప్రకాష్, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్‌కు స్వాగతం పలికారు. సంఘం నాయకులు బల్ల సత్తయ్య, నిజ్జన రమేష్, బి.విఠల్, నాగరాజు తదితరులున్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచే బాధ్యత ఉపాధ్యాయులదే

డీఈవో రాజు


భిక్కనూరులో మాట్లాడుతున్న డీఈవో రాజు

భిక్కనూరు/దోమకొండ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే బాధ్యత ఉపాధ్యాయులదేనని డీఈవో రాజు అన్నారు. భిక్కనూరు, దోమకొండ మండలాల్లో నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష మండల స్థాయి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయులు తమ సామర్థ్యాన్ని పెంపొందించుకుని బడి బాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా కృషిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని డీఈవో రాజు అన్నారు. కార్యక్రమంలో ఏఎంవో వేణుగోపాల్‌శర్మ, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, కోర్సు డైరెక్టర్ మాణిక్యశర్మ, ఆర్పీలు శ్రీనివాస్ శర్మ, ఆనంద్‌రావు, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

వృథాగా తాగు నీరు

పెద్దకొడప్‌గల్ (జుక్కల్) : మండలంలోని టికారం తండాలో తాగునీరు వృథా అవుతోంది. తండాలో ఎక్కడా బోరు వేయించినా నీళ్లు పడకపోవడంతో అంజని గ్రామశివారులో బోరు వేయించారు. అక్కడి 5 కి.మీ. మేర పైపులైన్ వేయించి తండాకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వృథాగా పోతున్న తాగునీటిని అరికట్టాలని తండావాసులు కోరుతున్నారు.

టికారం తండాలో వృథాగా పోతున్న తాగునీరు



చెత్తతో నిండిన డ్రెయినేజీలు


హరిజనవాడలో చెత్తతో నిండిన డ్రెయినేజీ

బాన్సువాడ : పట్టణంలోని పాత బాన్సువాడ కుర్మ గల్లీలో సీసీ రోడ్డు అపరిశుభ్రంగా మారింది. హరిజనవాడ సమీపంలోని డ్రెయినేజీ చెత్తా చెదారం, ప్లాస్టిక్ వస్తువులతో నిండిపోయింది. ఈ డ్రైనేజీలో కుక్కలు, కోళ్లు పడి చనిపోతున్నాయి.మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీని,సీసీ రోడ్డును శుభ్రం చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నేత్రదానం

బోధన్: పట్టణంలోని అనిల్ టాకీస్ రోడ్డులోని లక్ష్మి అపార్టుమెంట్ నివాసీ ఎన్ రమేశ్(59) బుధవారం మృతి చెందాడు. ఆయన కుటుంబసభ్యులు రమేశ్ నేత్రాలు దానం చేయాలని నిర్ణయించుకొని బోధన్ లయన్స్ కంటి ఆస్పత్రికి సమాచారం అందించారు. ఈ మేరకు మృతుడి రెండు కళ్లను వైద్యులు సేకరించారని లయన్స్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు పోలవరపు బసవేశ్వర్ రావు తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదస్థితిలో బాలింత మృతి

- అత్తింటి వారే కొట్టి చంపేశారని కుటుంబీకుల ఆరోపణ
- తీవ్ర ఉద్రిక్తత.. భారీ పోలీస్ బందోబస్తు


పూజ (ఫైల్)


ఆందోళన చేస్తున్న పూజ కుటుంబసభ్యులు

ఆర్మూర్‌టౌన్ : అనుమానాస్పద స్థితిలో ఓ బాలింత మృతి చెందిన ఘటన ఆర్మూర్ పట్టణంలోని వడ్డెర కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామానికి చెందిన పూజ(27)కు ఎనిమిదేళ్ల క్రితం ఆర్మూర్ పట్టణానికి చెందిన సాయిలుతో వివాహమైంది. వీరికి ఆరేళ్ల కూతురు రష్మిత ఉండగా, రెండు నెలల క్రితం కొడుకు పుట్టాడు. భర్త సాయిలు నెల రోజుల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. కాగా, మంగళవారం సాయంత్రం ఇంట్లో గొడవ జరగడంతో అత్త నర్సవ్వ, మరిది అశోక్, ఆడపడుచు శైలజ రాత్రి పూజను తీవ్రంగా కొట్టినట్లు కూతురు రష్మిత తెలిపింది. పెళ్లయిన నాటి నుంచి అదనపు కట్నం కోసం భర్త సాయిలు, అత్త నర్సవ్వ, ఆడపడుచు శైలజ, మరిది అశోక్ వేధింపులకు గురి చేస్తుండేవారని పూజ కుటుంబీకులు ఆరోపించారు. పూజ మృతి విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వడ్డెర కాలనీకి చేరుకున్నారు. తమ కూతురును అత్తింటి వారే కొట్టి చంపారని, వారిని తమకు అప్పగించాలని ఆందోళనకు దిగారు. దీంతో ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది భారీగా మోహరించారు. ఉద్రిక్తతల నడుమ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

రామడుగు ప్రాజెక్టులో పడి యువకుడి మృతి


రాజశేఖర్ గౌడ్ (ఫైల్)

ధర్పల్లి: మండలంలోని రామడుగు ప్రాజెక్ట్‌లో స్నానానికి వెళ్లి ఊపిరాడక ఒక యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండ గ్రామానికి చెందిన రాజశేఖర్ గౌడ్ (28) స్నేహితులతో కలిసి చేపలు పట్టేందుకు బుధవారం మధ్యాహ్నం రామడుగు ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. మొదట స్నానం చేయడానికి రాజశేఖర్ గౌడ్ నీటిలో దూకాడు. ప్రాజెక్టు లోతు ఎక్కువగా ఉండటంతో బయటకు రాలేదు. స్నేహితులు, స్థానికుల సహాయంతో రాజశేఖర్ గౌడ్‌ను బయటకు తీసుకురాగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

సాటాపూర్‌లో కార్డన్ సెర్చ్


గ్రామస్తులతో మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామంలో బుధవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీపీ ఆదేశాల మేరకు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం చేపట్టారు. నాలుగు ఆటోలు, 80 ద్విచక్ర వాహనాలకు ధ్రువపత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మోటారు వాహన నిబంధనలు పాటించాలని సూచించారు. లేనిపక్షంలో జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఓ ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీ చేసి 45 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సై చంద్రమోహన్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురి రిమాండ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని భవానీపేట గ్రామంలో ఇటీవల బండరాళ్లు పేల్చిన ఘటనలో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పీఎస్సై రాఘవేందర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భవానీపేట గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో భూమి అభివృద్ధి చేసేందుకు అనుమతి లేకుండా గ్రామానికి చెందిన దర్శనం సిద్దిరాములు మందు పాతర పెట్టి బండరాళ్లను పేల్చినట్లు తెలిపారు. దీంతో సమీపంలోని నివాస గృహాలు ధ్వంసమయ్యాయి. ఘటనకు బాధ్యులైన భూ యజమాని దర్శనం సిద్ధిరాములుతోపాటు ఆరెపల్లి నర్సింలు, ఒడ్డె రమేశ్, మంజు సుభాష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి కంప్రెషర్ ట్రాక్టర్, పొక్లెయిన్, బ్యాటరీ, జిలెటిన్ స్టిక్స్, వైర్లు, డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరి మృతి

ఎడపల్లి(బోధన్): కారు అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై వంశీ చందర్‌రెడ్డి తెలిపారు. బోధన్ పట్టణానికి చెందిన నిమ్మగడ్డ రమేశ్(59) ఎడపల్లి శివారులోని సరయు ఫంక్షన్ హాల్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా నిజామాబాద్‌కు చెందిన రాజేశ్ కారును అతివేగంగా నడిపి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో నిమ్మగడ్డ రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి మామ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ల చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల ఇంటి ఎదుట పార్క్ చేసిన రెండు బైక్‌లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నగరంలోని షిర్డీ సాయికృపా నగర్ కాలనీలో సాదుల్లా శేఖర్ ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు చేశారు. బోర్గాం సమీపంలోని శ్రామిక్‌నగర్‌లో రాములు ఇంటి ఎదుట బైక్‌ను పార్కింగ్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కంటెయినర్

- డ్రైవర్ మృతి, క్లీనర్‌కు తీవ్ర గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కంటెయినర్

కామారెడ్డి క్రైం: సాంకేతిక సమస్య తలెత్తడంతో రోడ్డుపై ఆగి ఉన్న లారీని అతి వేగంగా వచ్చిన ఓ కంటెయినర్ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో కంటెయినర్ డ్రైవర్ మృతి చెందగా క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కామారెడ్డి సమీపంలోని టేక్రియాల్ బైపాస్‌కు కొద్ది దూరంలో బుధవారం వేకువజామున 5 గంటల ప్రాంతంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్తాన్‌కు చెందిన ఓ లోడ్ లారీ హైదరాబాద్ వైపు వెళ్తోంది. అదే దారిలో అతివేగంగా వచ్చిన ఓ మహారాష్ట్రకు చెందిన కంటెయినర్.. లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో కంటెయినర్ ముందు భాగం నుజ్జునుజ్జయింది. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. తీవ్రంగా గాయపడిన కంటెయినర్ డ్రైవర్ సచిన్ జవార్‌సింగ్(30), క్లీనర్‌ను కామారెడ్డి జనరల్ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే డ్రైవర్ సచిన్ జవార్‌సింగ్ మరణించాడు. ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతోనే లారీ రోడ్డుపై ఆగిపోయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఇటుక బట్టీలో వలస కార్మికుల గుర్తింపు

- స్వరాష్ట్రానికి పంపిన అధికారులు
- యజమానిపై కేసు నమోదు

కామారెడ్డి రూరల్: ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి ఇటుక బట్టీల్లో పనిచేయించుకుంటున్న యజమానిపై అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం కింద కేసు నమోదైంది. కామారెడ్డి మండలం గూడెం గ్రామ శివారులో మెస్సర్స్ కేకేఎస్ ఇటుక బట్టీపై బుధవారం దాడి చేసినట్లు సహాయ కార్మిక శాఖ కమిషనర్ ఎం కోటేశ్వర్లు తెలిపారు. అంతర్రాష్ట్ర ఒడిశా వలస కార్మికులు పన్నెండు మందిని బట్టీలో గుర్తించామన్నారు. వారిని విచారించగా తాము సొంత గ్రామాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పినట్లు పేర్కొన్నారు. అనంతరం యజమానిని విచారించగా కార్మికులను తిరిగి వాళ్ల స్వగ్రామాలకు పంపేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

కార్మికులకు రావాల్సిన జీతభత్యాలు ఇప్పించి కార్మికులను స్వస్థలాలకు పంపేందుకు ఏర్పాట్లు చేశారు. దాడిలో సహాయ కార్మిక అధికారి, సయ్యద్ కమ్రుద్దీన్, తహసీల్దార్ జనార్దన్, దేవునిపల్లి ఎస్సై రాజు, బాలల పరిరక్షణ అధికారిని జే స్రవంతి తదితరులు పాల్గొన్నారు.


గూడెంలో ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఒడిశా కార్మికులను వారి స్వగ్రామాలకు పంపుతున్న దృశ్యం

సైబర్ నేరగాళ్ల నుంచి రూ.5.80 లక్షలు రికవరీ

- పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు

కామారెడ్డి క్రైం: ఓ వ్యక్తికి వాట్సాప్ వీడియో కాల్ చేస్తూ పోలీసులమని చెప్పి బెదిరింపులకు పాల్పడి అతని అకౌంట్లో నుంచి రూ.5.80 లక్ష లు సైబర్ నేరగాళ్లు కాజేయగా, వెంటనే స్పందించి డబ్బులు మొత్తం రికవరీ చేశారు కామా రెడ్డి పోలీసులు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన లోకుల రాజేందర్ అనే వ్యక్తికి బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్ వీడియో కాల్ చేశారు. తాము ముంబై పోలీసులమని నమ్మించారు. టెలికాం సర్వీస్ ద్వారా మీ ఆధార్ కార్డుతో మరొకరు డబ్బులు తీసుకున్నారని, మీపై మనీ లాండరింగ్ కేసు నమోదైందని భయభ్రాంతులకు గురిచేశారు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ ఫోన్ చేసి మీ అకౌంట్‌లో ఉన్న డబ్బులు మొత్తం తమ అకౌంట్‌కు బదిలీ చేయాలని, లేకపోతే అరెస్టు చేస్తామని బెదిరించారు. భయపడిన రాజేందర్ తన అకౌంట్లోని రూ.5.80 లక్షలు సైబర్ నేరగాళ్లు చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేశాడు. కొద్దిసేపటి తర్వాత అనుమానం వచ్చి పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సదరు బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేసి, డబ్బులు రికవరీ చేసి బాధితుని అకౌంట్లో జమ చేశారు. దీంతో బాధితుడు రాజేందర్ పట్టణ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వెల్లడించారు.

కంబోడియాలో దేవునిపల్లి యువకుడి మృతి

- 14న గుండెపోటుతో మరణం
- కుటుంబ సభ్యులకు ఆలస్యంగా సమాచారం


భూంరావుగారి కిరణ్‌కుమార్ (ఫైల్)

కామారెడ్డి అర్బన్: కంబోడియా రాజధాని నాంఫెన్‌లో కామారెడ్డి పట్టణం దేవునిపల్లికి చెందిన భూంరావుగారి కిరణ్‌కుమార్ (36) ఈ నెల 14న గుండెపోటుతో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉపాధి కోసం కంబోడియా వెళ్లిన కిరణ్‌కుమార్ నాంఫెన్‌లో గుండెపోటుతో మరణించిన విషయం భారతీయ రాయబార కార్యాలయం ద్వారా పోలీసులకు సమాచారం అందించగా వారు సరిగ్గా స్పందించలేదని తెలుస్తుంది. దేవునిపల్లిలోని కిరణ్‌కుమార్ ఇంటికి పోలీసులు నేరుగా వచ్చి వివరాలు తెలుసుకోకుండా స్టేషన్‌కు వచ్చి కలవాలని ఫోన్ చేయడంతో సరైనపత్రాలు లేక భయపడిన కుటుంబసభ్యులు మధ్యవర్తుల ద్వారా రెండుమూడు రోజులకు కలిశారు. కాగా, తెలిసిన బంధువుల ద్వారా కంబోడియాలోని భారత రాయబార కార్యాలయం కౌన్సిలేట్ అబ్రహంతో మాట్లాడగా ఆయన కిరణ్‌కుమార్ మృతదేహం తరలింపునకు కావాల్సిన పత్రాల ఫార్మేట్ పంపినట్టు చెబుతున్నారు. మృతదేహాన్ని త్వరగా తెప్పించేందుకు కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిల ద్వారా ప్రయత్నాలు ప్రారంభించారు. మృతుడి గుర్తింపు పత్రాలు పంపిన తర్వాత శవం ఇంటికి చేరుకోవడానికి వారం రోజులు పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. కిరణ్‌కుమార్‌కు తల్లిదండ్రులతోపాటు భార్య, ఇద్దరు కొడుకులున్నారు.


వేధింపులు భరించలేక కొడుకును హత్య చేశాడు

ఏఎస్పీ చైతన్య రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్య రెడ్డి

కామారెడ్డి క్రైం: జులాయిగా తిరుగుతూ డబ్బుల కోసం నిత్యం వేధించడంతోనే సొంత కొడుకును తండ్రి హత్య చేసినట్లు విచారణలో తేలింది. మూడు రోజుల క్రితం కామారెడ్డి మండలం లింగాపూర్ గ్రామంలో జరిగిన వడ్ల నిఖిల్ (24) హత్య కేసులో నిందితుడైన తండ్రి భాస్కర్‌ను రూరల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కామారెడ్డి సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు వెల్లడించారు. లింగాపూర్ గ్రామానికి చెందిన భాస్కర్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు. గతంలో కుమార్తెకు పెళ్లి చేశారు. కొడుకు నిఖిల్ జులాయిగా తిరుగుతుండటంతో ఏడాది క్రితం గల్ఫ్‌కు పంపారు. అక్కడ కూడా ఎక్కువ రోజులు ఉండకుండా తిరిగి వచ్చేశాడు. వచ్చిన నాటి నుంచి గ్రామంలో జులాయిగా తిరుగుతూ ఏపనీ చేసేవాడు కాదు. పైగా మద్యానికి బానిసై నిత్యం తల్లిదండ్రులను డబ్బుల కోసం వేధించేవాడు. దీంతో పలుసార్లు తండ్రీకొడుకుల మధ్య గొడవ జరిగింది. గత ఆదివారం రాత్రి గొడవ జరిగినప్పుడు భాస్కర్ అక్కడే ఉన్న ఓ కర్రతో నిఖిల్ తలపై కొట్టాడు. బలమైన గాయం కావడంతో వెంటనే కామారెడ్డి జనరల్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చారు. నిఖిల్ బతికి ఉంటే తమను ప్రశాంతంగా ఉండనివ్వడని భావించిన తండ్రి భాస్కర్ అతడిని ఎలాగైనా చంపేయాలని అనుకున్నాడు. సోమవారం వేకువజామున రాడ్డుతో మరోసారి నిఖిల్‌పై దాడి చేశాడు. తీవ్రగాయాలైన నిఖిల్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లగానే చనిపోయాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న భాస్కర్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. కేసును తక్కువ సమయంలోనే ఛేదించిన రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బందిని అభినందించారు.

పెళ్లి కుదరడం లేదని..


రాజ్‌కుమార్ మృతదేహం

కమ్మర్‌పల్లి: పెళ్లి సంబంధాలు కుదరడం లేదని బాధపడుతూ ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కమ్మర్‌పల్లి మండలం ఇనాయత్‌నగర్‌లో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఇనాయత్ నగర్ గ్రామానికి చెందిన జక్కుల రాజ్‌కుమార్(23)కు కుటుంబసభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో సోమవారం సాయంత్రం ఇంట్లో ఉన్న గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మంగళవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యపై హత్యాయత్నం కేసులో ఐదేళ్లు జైలు

కామారెడ్డి క్రైం: భార్యపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారి మండలం మర్లకుంట తండాకు చెందిన స్వాతికి మాచారెడ్డి మండలానికి చెందిన విస్లావత్ లచ్చీరాంతో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. లచ్చీరాం మద్యానికి బానిసై అదనపు కట్నం తేవాలని తరచూ భార్యను వేధించేవాడు. దీంతో స్వాతి తల్లిగారింటి వద్దనే ఉంటూ గాంధారిలో టైలరింగ్ నేర్చుకునేది. 2022 ఫిబ్రవరి 26న టైలరింగ్ నేర్చుకునే చోటికి కత్తితో వచ్చిన లచ్చీరాం.. స్వాతిపై దాడి చేశాడు. అక్కడున్న వారు అడ్డుకొని తీవ్రగాయాలైన స్వాతిని ఆస్పత్రిలో చేర్పించారు. గాంధారి పోలీసులు కేసు నమోదు చేసి లచ్చీరాంను రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. నేరం రుజువు కావడంతో కామారెడ్డి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సుమలత నిందితుడికి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. సరైన పద్ధతిలో కేసు విచారణ చేపట్టిన అప్పటి గాంధారి ఎస్సై సాయిరెడ్డి, ప్రస్తుత ఎస్సై ఆంజనేయులు, పీపీ దామోదర్ రెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్సై రామేశ్వర్ రెడ్డి, సిబ్బందిని ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

విద్యుదాఘాతానికి రైతు బలి


భుక్య రాజు నాయక్ (ఫైల్)

రామారెడ్డి: విద్యుదాఘాతానికి ఓ రైతు బలైన ఘటన రామారెడ్డి మండలంలోని ఘన్‌పూర్ తండాలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన భుక్య రాజు నాయక్(35) బుధవారం మధ్యాహ్నం పొలంలో విరిగిపోయిన చెట్లను తొలగిస్తుండగా, మంగళవారం కురిసిన వర్షానికి తెగిపడిన విద్యుత్ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు నాయక్ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలానికి వెళ్లి చూడగా విగత జీవిగా పడి ఉన్నాడు. మృతుడికి భార్య వనీత, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.